

## 2,100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్‌కు గురువారం 2,100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని జేఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. డ్యాంలో 0.881 టీఎంసీల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.



## అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: నిత్య అన్నదాన పథకానికి గురువారం బాపట్లకు చెందిన వి.సతీష్ రూ.1,16,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు నాగరాజుకు అందజేశారు.



## రక్తదానంతో ప్రాణదానం

ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసేందుకు యువకులు ముందుకు వస్తున్నారు. రక్తాన్ని నిల్వ చేసేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో బ్లడ్ బ్యాంకులు ఉన్నాయి. 8లో▸

# ప్రజెంట్ సార్!

- పునఃప్రారంభమైన పాఠశాలలు
- మొదటి రోజు 30.67 శాతం హాజరు
- కొత్త అడ్మిషన్లతో ప్రభుత్వ స్కూళ్లలో సందడి
- కొంత మందికే అందిన పుస్తకాలు
- విద్యార్థులకు రాగిజావ, కోడిగుడ్ల అందజేత

**చిన్నారుల ఆటపాటలతో** సందడి చేసిన వీధులన్నీ బోసిపోయాయి.. ఇళ్లల్లో అల్లరి మూగబోయింది.. తల్లిదండ్రులు చేతులూపుతూ బైబై చెప్పగా పుస్తకాల బ్యాగు తీసుకుని పిల్లలంతా భారంగా కదిలారు. తొలి రోజు పాఠశాలలో 'ప్రజెంట్ సార్' అని పలికారు. కొత్త పుస్తకాలు తీసుకుని మురిసిపోయారు. పాత మిత్రులను కలుసుకుని సంతోషంతో గంతులేశారు. ఆనందంతో పైతరగతులకు వెళ్లిన వారు కొందరైతే.. ఏడ్చుకుంటూ అప్పుడప్పుడే బుడి'బడి' అడుగులు వేసిన వారు మరికొందరు.. మొత్తంగా గురువారం పాఠశాలల్లో సరికొత్త కళ కనిపించింది. తొలిరోజు హాజరు శాతం అంతంతమాత్రమే నమోదైంది.



మొదటి రోజు సంతోషంగా కర్నూలు బి.క్యాంప్ స్కూల్‌కు వస్తున్న బాలికలు

**కర్నూలు సిటీ:** వేసవి సెలవులు ముగిసి గురువారం పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. తల్లిదండ్రులు, పిల్లల రాకపోకలతో స్కూళ్లలో సందడి కనిపించింది. పునఃప్రారంభం రోజున పాఠశాలల పరిసరాలను శుభ్రం చేయించారు. తరగతి గదులను సరికొత్తగా తీర్చిదిద్దారు. కొన్ని చోట్ల తోరణాలతో విద్యార్థులకు స్వాగతం పలికారు. గతేడాది చదివిన తరగతి గదిని వదిలి పై తరగతికి వెళ్తూ విద్యార్థులు ఆనందంతో గంతులువేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు కొంత మందికి మొదటి రోజునే పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్, బ్యాగ్‌లు అందజేశారు. ఉదయమే స్కూల్స్ పునఃప్రారంభించడంతో కొంత హడావుడిగానే పిల్లలు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. కొత్తగా పిల్లలను స్కూళ్లలో అడ్మిషన్స్ చేయించే తల్లిదండ్రులు వచ్చారు. ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పడంతో అర్బన్ ప్రాంతాల్లో ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్ చేయించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

### మొదటి రోజు హాజరు అంతంత మాత్రమే

వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు చేతిలో పెట్టాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు మొదటి రోజున పిల్లలకు కేవలం పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్‌తో పాటు కేవలం బ్యాగ్స్ మాత్రమే అందజేశారు. అది కూడా హాజరైన వారిలో సగం మాత్రమే ఇచ్చారు. మొదటి రోజున హాజరు శాతం 37.39 మాత్రమే ఉంది. దీంతో వచ్చిన వారందరికి పుస్తకాలను, నోటు బుక్స్, బ్యాగ్‌లను మాత్రమే పంపిణీ చేశారు. జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలలు 2,242 ఉన్నాయి. ఈ స్కూళ్లలో 4.73 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాల్లో గోరుముద్ద పథకం అమలవుతోంది. ఈ స్కూళ్లు 1,433 ఉండగా ఇందులో 2.31 లక్షల మంది విద్యార్థులకుగాను మొదటి రోజున 86,390 మంది మాత్రమే హాజరయ్యారు. వీరిలో 84,745 మంది విద్యార్థులకు గోరుముద్ద పథకం ద్వారా రాగిజావ, ఉడికించిన కోడి గుడ్లు, సాంబార్‌బాత్, పులిహోరాతో టమోటా చట్నీ అందజేశారు.



మోగిన బడిగంట



కౌతాళం మండలంలోని ప్రభుత్వ స్కూల్‌లో అడ్మిషన్ తీసుకుంటున్న విద్యార్థిని తల్లి



కర్నూలులో సరస్వతీ దేవికి పూజలు చేస్తున్న విద్యార్థినులు



పుస్తకాలు తీసుకొని వస్తూ..



కమ్మనైన గోరుముద్ద

### చదువుతోనే మంచి భవిష్యత్తు



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న డీఈఓ శామ్యూల్

**కోడుమూరు రూరల్:** చదువుతోనే చక్కటి భవిష్యత్తు ఉంటుందని డీఈఓ కె.శామ్యూల్ అన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైన వేళ గురువారం కోడుమూరులోని బాలుర హైస్కూల్‌ను డీఈఓ సందర్శించారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేయడంతో పాటు పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి కూడా ప్రభుత్వమందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. పదోతరగతి విద్యార్థులు ఇంగ్లిష్, సైన్స్, మ్యాథ్స్‌పై పట్టు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు వసంతలక్ష్మి, శరభయ్య, హెచ్ఎం తైమూర్‌బాషా పాల్గొన్నారు.

### పచ్చని తోరణాలతో స్వాగతం



మామిడి ఆకుల తోరణాలతో అలంకరించిన హాస్టల్

**కర్నూలు(అర్బన్):** రంగవళ్లులు, పచ్చని మామిడి ఆకుల తోరణాలు, పూలదండలు, టెంకాయమట్టలతో నగరంలోని బీ క్యాంప్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని కళాశాల బాలికల నంబర్ 1 వసతి గృహం ముస్తాబైంది. హాస్టల్ ముందుభాగంలో కల్లాపి చల్లి రంగు రంగుల ముగ్గులు వేశారు. గురువారం కళాశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వ వసతి గృహాలు కూడా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ జే రంగలక్ష్మిదేవి ఆదేశాల మేరకు వసతి గృహ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు హాస్టల్‌కు వచ్చే రెన్యూవల్, ఫ్రెష్ బోర్డర్లు, వారి తల్లిదండ్రులకు మంచి వాతావరణంలో స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసినట్లు వసతి గృహ సంక్షేమాధికారిణి బీ బెన్నమ్మ తెలిపారు. హాస్టల్ ప్రారంభమైన మొదటి రోజు కావడంతో గ్యాస్ స్టవ్‌లకు కూడా పూజలు నిర్వహించి బెల్లం, పాలతో అన్నం వండి విద్యార్థినులు, తల్లిదండ్రులకు వడ్డించారు.

## న్యూస్‌రీల్

### జెడ్పీ సమావేశ భవనానికి మెరుగులు



టేబుళ్లను రిపేరీ చేస్తున్న కార్పెంటర్లు

**కర్నూలు(అర్బన్):** సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్న నేపథ్యంలో జెడ్పీ సమావేశ భవనానికి మెరుగులు దిద్దుతున్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు వరించిన విషయం తెలిసిందే. ఈ సమావేశానికి కర్నూలు, నంద్యాల పార్లమెంట్ సభ్యులతో పాటు ముగ్గురు నూతన మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే జెడ్పీ సమావేశ భవనంలోని వేదిక మీద ఉన్న టేబుళ్లు, కుర్చీలు, ఏసీ, ఫ్యాన్ల మరమ్మతులు చేపట్టారు. అలాగే భవనం రూఫ్ లీకేజీకి సంబంధించి పంచాయతీరాజ్ ఇంజినీర్లు కూడా పరిశీలించి మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. మీటింగ్ హాల్ పరిసరాలను కూడా శుభ్రం చేయనున్నారు.

### డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు డిబార్

**కర్నూలు కల్చరల్:** చూచిరాతలకు పాల్పడుతూ ఆరుగురు డిగ్రీ విద్యార్థులు డిబార్ అయ్యారని రాయలసీమ యూనివర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం నిర్వహించిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 931 మందికి 780 మంది విద్యార్థులు హాజరయ్యారని, 151 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మొత్తం 84 శాతం హాజరు నమోదైందని తెలిపారు. ఎమ్మిగనూరు రావూస్ డిగ్రీ కళాశాల, సిద్దార్థ డిగ్రీ కళాశాల, బనగానపల్లె శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల, డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కర్నూలు ఆర్‌సీ రెడ్డి డిగ్రీ కళాశాల, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రాలలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ఆరుగురు విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు పేర్కొన్నారు.

### బక్రీద్ వేడుకలకు ఇద్దరు నోడల్ అధికారులు

- జిల్లాలో 17 నుంచి 19 వరకు వేడుకలు

**కర్నూలు (టౌన్):** జిల్లాలో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు మూడు రోజుల పాటు బక్రీదు వేడుకలు నిర్వహించనున్నారు. ఈ పండుగ సందర్భంగా ముస్లింలు గొర్రెలు, మేకలు, ఒంటెలు, దున్నపోతులను వధిస్తారు. సంప్రదాయకంగా నిర్వహించే ఈ పండుగలో జంతు వ్యర్థాలను టన్నుల కొద్ది సేకరించాల్సి ఉంటుంది. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ప్రత్యేకంగా ఇద్దరు నోడల్ అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన గురువారం నియమించారు. పంచాయతీల పరిధిలో జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు, పట్టణాల్లో కర్నూలు నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ నోడల్ అధికారులుగా వ్యవహరించనున్నారు . కర్నూలు కమిషనర్ కర్నూలుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు నగర పంచాయతీలను పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే కర్నూలులో 12 వేల ప్లాస్టిక్ బ్యాగులను పంపిణీ చేస్తున్నారు. టెండర్ ప్రక్రియ ద్వారా వాటిని సేకరించి ముస్లింలకు ఉచితంగా ఇవ్వనున్నారు. ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా జంతు వ్యర్థాలను ప్లాస్టిక్ బ్యాగుల్లో వేసి మున్సిపల్ , పంచాయతీ సిబ్బందికి అందించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో నగరపాలక అదనపు కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఈఈ షాకీర్ హుస్సేన్, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంతియాజ్ పాల్గొన్నారు.

### ముస్లిం మైనార్టీ విద్యార్థులకు అవకాశం

**కర్నూలు సిటీ:** స్థానిక మైనారిటీ గురుకుల జూనియర్ కాలేజీలో మిగిలిపోయిన సీట్లను ముస్లిం, మైనారిటీ విద్యార్థులతో భర్తీ చేయనున్నామని కాలేజీ ప్రిన్సిపాల్ సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో 9 సీట్లు, బైపీసీలో 12 సీట్లు,సీఈసీలో 22 సీట్లు మిగిలాయని, ఎలాంటి ప్రవేశ పరీక్ష రాయకున్నా ఆసక్తి ఉన్న మైనార్టీ విద్యార్థులు సర్టిఫికెట్లతో ఈనెల 18వ తేదీ లోపు నేరుగా కాలేజీకి వస్తే ప్రవేశం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8712625080 నంబరును సంప్రదించాలన్నారు.

## చిప్పగిరిలో 53.4 మి.మీ వర్షం



**కర్నూలు(అగ్రికల్చర్):** జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు వెల్దుర్తి మినహా జిల్లా వ్యాప్తంగా తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా చిప్పగిరిలో 53.4 మి.మీ, అత్యల్పంగా కోసిగిలో 6.2 మి.మీ వర్షపాతం నమోదైంది. రానున్న రోజుల్లో కూడా మరింత విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కర్నూలు జిల్లా జూన్ నెల సాధారణ వర్షపాతం 77.7 మి.మీ ఉండగా 121.9 మిమీ వర్షపాతం నమోదైంది. అంటే 13 రోజుల్లోనే 57 శాతం అధిక వర్షపాతం నమోదు కావడం విశేషం. చెరువులు, కుంటలు, వాగులు, వంకలు జలకళను సంతరించుకుంటున్నాయి.

- నంద్యాల జిల్లాలో కూడా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. జూన్ నెల సాధారణ వర్షపాతం 76.8 మిమీ ఉండగా ఇప్పటి వరకు 190.6 మి.మీ వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతంతో పోలిస్తే 110 మి.మీ అధిక వర్షపాతం నమోదు కావడం విశేషం.

| మండలం | వర్షపాతం(మి.మీ) |
|---|---|
| మద్దికెర | 52.6 |
| ఆలూరు | 52.4 |
| గూడూరు | 49 |
| హాలహర్వి | 44.8 |
| హొళగుంద | 37.4 |
| ఎమ్మిగనూరు | 35.4 |
| గోనెగండ్ల | 34.6 |
| సీ.బెళగల్ | 34 |
| నందవరం | 30.2 |

## రిజిస్ట్రేషన్ సేవలకు ఆటంకం

- మొరాయిస్తున్న సర్వర్

**కర్నూలు(సెంట్రల్):** భూములు, భవనాలు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు సర్వర్ సమస్య తలెత్తుతోంది. తరచూ సీఎంఎంఎఫ్ సైట్ నుంచి చలానాలు జనరేట్ కాకపోవడంతో రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోతున్నాయి. దీంతో క్రయ, విక్రయాలకోసం వచ్చిన వారు వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. భూముల విలువలో రిజిస్ట్రేషన్ ఫీజును డాక్యుమెంట్ రైటర్లు సీఎఫ్ఎంఎస్ సైట్ నుంచి చలాన్ల రూపంలో చెల్లిస్తారు. అయితే ఆ సైటు తరచూ సతాయిస్తోంది. దీంతో చలానాలు జనరేట్ కావడంలేదు. మరోవైపు బ్యాంకులకు వెళ్లి చలాన్ల తీసుకోవడానికి వెళ్లిన అక్కడి సిబ్బంది సహకరించడంలేదు. దీంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారు వేచి ఉండక తప్పడంలేదు. ఒకరోజు పూర్తి కావాల్సిన పని రెండు, మూడు రోజులుకూడా సమయం తీసుకుంటుండడంతో పనులు మానుకోవాల్సి వస్తోందని క్రయ, విక్రయదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సర్వర్ సమస్య తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# యాస్పిరేషన్ బ్లాకుల్లో అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్‌ను ఆదేశించిన నీతి అయోగ్ సీఈఓ సుబ్రమణ్యం



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సృజన

**కర్నూలు(సెంట్రల్):** యాస్పిరేషన్ బ్లాకుల్లో సర్వతోముఖాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని నీతి అయోగ్ సీఈఓ సుబ్రమణ్యం జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం ఢిల్లీ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యాస్పిరేషన్ బ్లాక్‌లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో యాస్పిరేషన్ బ్లాక్‌లుగా ఎంపికై న చిప్పగిరి, హొళగుంద, మద్దికెర(ఈస్టు) మండలాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ డాక్టర్ జి.సృజన నీతి అయోగ్ సీఈఓకు పవర్ పాయింట్ ప్రజెంటేషన ద్వారా వివరించారు. ఆరోగ్యం, పోషకాహారం, విద్య, వ్యవసాయం, కనీస మౌలిక సదుపాయాలు తదితర అంశాల్లో తీసుకున్న చర్యలపై ఆమె తెలిపారు. తదనంతరం చిప్పగిరి, మద్దికెర(ఈస్టు), హొళగుంద బ్లాకుల్లో అభివృద్ధికి సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి సీపీఓ హిమప్రభాకరరాజు హాజరయ్యారు.

# బీపీడీపీ నివేదికలపై అశ్రద్ధ వద్దు

- జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి

**కర్నూలు(అర్బన్):** బ్లాక్ పంచాయత్ డెవలప్‌మెంట్ ప్లాన్ (బీపీడీపీ) నివేదికలను సిద్ధం చేసి పంపడంలో ఎలాంటి అశ్రద్ధ ప్రదర్శించరాదని జిల్లా పరిషత్ సీఈఓ సీ నాసరరెడ్డి అన్నారు. ఇంకా జిల్లాలోని పత్తికొండ, పెద్దకడుబూరు, కల్లూరు మండలాల నుంచి నివేదికలు అందలేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. గురువారం స్థానిక జెడ్పీలోని మినీ సమావేశ భవనంలో డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డితో కలిసి జిల్లాలోని అన్ని మండల పరిషత్‌లకు చెందిన పరిపాలనాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక లెక్కల గురించి ఆరా తీశారు. లోకల్ ఫండ్ ఆడిట్ అభ్యంతరాలపై దృష్టి కేంద్రీకరించాలని, ఎంపీటీసీ సభ్యులకు అందించిన గౌరవ వేతనాలకు సంబంధించి ద్రవ్య వినియోగపత్రాలను వెంటనే అందించాలన్నారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6, స్త్రీ శిశు సంక్షేమ శాఖకు అందించే 15 శాతం ఇయర్ మార్క్‌డ్ ఫండ్‌కు ఎంత మొత్తం కేటాయించారు? ఎంత ఖర్చు చేశారనే విషయాలపై స్పష్టత ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించాల్సి ఉందన్నారు. ఆయా మండలాల్లో ఎంపీటీసీ, సిబ్బంది ఖాళీల వివరాలను తెలియజేయాలన్నారు.

# జిల్లాలో పత్తి విత్తనాల కొరత

- కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్న డీలర్లు

**కర్నూలు(అగ్రికల్చర్):** పత్తి విత్తనాల కొరత రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. జిల్లాలో నల్ల రేగడి నేలలు ఎక్కువగా గున్నాయి. ఖరీఫ్ సాధారణసాగు 4.20 లక్షల హెక్టార్లు ఉండగా.. 2.50 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేయనున్నారు. ఇప్పటికే నల్లరేగడి భూముల్లో పత్తి విత్తనం నాటుకునే పనులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. జిల్లాలో ప్రధానంగా బీటీ-2 పత్తి సాగు చేస్తారు. జిల్లాకు 20 లక్షల ప్యాకెట్లు అవసరం. అయితే మార్కెట్‌లో తగినన్ని ప్యాకెట్లు లేవు. దీనిని అవకాశంగా తీసుకొని కొందరు డీలర్లు, పంపిణీదారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరకు అమ్ముతున్నారు. 450 గ్రాముల బీటీ-2 పత్తి విత్తన ప్యాకెట్ ఎంఆర్‌పీ రూ.864 ఉండగా.. కొన్ని కంపెనీల ప్యాకెట్లును రూ.1200 ఆపై ధరలకు విక్రయిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 5000 హెక్టార్లలో విత్తనం పనులు పూర్తయ్యాయి. వేరుశనగ విత్తన పనులు, ఉల్లి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కూరగాయల సాగు పెరుగుతోంది.

## క్లుప్తంగా

### కేంద్ర కరువు కమిటీకి సహకరించాలి



రైతులు, వ్యవసాయ సహాయకులతో మాట్లాడుతున్న డీఏఓ

**దొర్నిపాడు:** రబీ పంట నష్టంపై మరోసారి పరిశీలించేందుకు వస్తున్న కేంద్ర కరువు కమిటీకి సహకరించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీ క్రిష్ణ రైతును కోరారు. గురువారం ఆయన స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ-2023 సంవత్సరానికి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించారన్నారు. ఈసందర్భంగా పంటనష్ట పరిహార జాబితాను సిద్ధం చేసిన విషయంపై కేంద్రబృందం పరిశీలించి రైతులతో మాట్లాడతారన్నారు. సమావేశంలో కోవెలకుంట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు సుధాకర్, మండల వ్యవసాయాధికారి సునీత పాల్గొన్నారు.

### ఆన్‌లైన్ లింక్ ద్వారా పరీక్ష రుసుం చెల్లించాలి

**నంద్యాల(న్యూటౌన్):** టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షల ఫీజు వచ్చే నెల 1 నుంచి మూడవ తేదీలోపు ఆన్‌లైన్ లింక్ ద్వారా చెల్లించాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి గురువారం తెలిపారు. అపరాధ రుసుంతో 8వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. మరింత సమాచారం కోసం 9959395765 నంబరును సంప్రదించాలన్నారు.

# రక్తదానంతో ప్రాణదానం

- యువతలో పెరిగిన రక్తదాన స్ఫూర్తి
- జిల్లాలో 20 బ్లడ్ బ్యాంకులు
- మరో 16 బ్లడ్ స్టోరేజ్ సెంటర్లు
- నాలుగేళ్లలో 818 క్యాంపుల నిర్వహణ
- 1,96,642 యూనిట్ల రక్తసేకరణ
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



రక్తదానం చేస్తున్న యువకులు

**కర్నూలు(హాస్పిటల్):** సాధారణంగా మన వారికి ఎవ్వరికైనా రక్తం అవసరమైతే రక్తదాతల గురించి ఆరా తీస్తాం. కానీ మనమే రక్తం ఇవ్వొచ్చని ఆలోచించం. కానీ ఇది ఒకప్పటి మాట. ప్రస్తుతం సమాజంలో మనుషుల్లో మార్పు వచ్చింది. రక్తనిధి కేంద్రాలకు రక్తం కోసం వచ్చిన వారు రక్తం రీప్లేస్‌మెంట్ చేయాలంటే వెంటనే రక్తదానం చేసి వెళ్తున్నారు. రక్తంలోని వివిధ గ్రూపులను కనుగొన్న నోబెల్ అవార్డు గ్రహీత, శాస్త్రవేత్త కార్ల్ స్టీనర్ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవంగా నిర్వహించాలని ప్రకటించింది.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, నంద్యాలలోని జిల్లా ఆసుపత్రి, ఆదోనిలోని ఏరియా హాస్పిటల్‌తో పాటు ప్రైవేటుగా కర్నూలు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి, విశ్వభారతి హాస్పిటల్, ఆర్ఆర్ హాస్పిటల్, అక్షయ బ్లడ్ బ్యాంక్, న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంక్, కర్నూలు బ్లడ్ సెంటర్, కేర్ బ్లడ్ సెంటర్, మెడిప్లస్ బ్లడ్ సెంటర్, నంద్యాల శాంతిరామ్ హాస్పిటల్, ఉదయానంద హాస్పిటల్ బ్లడ్ సెంటర్, విజయ హాస్పిటల్, పెంచికలపాడు విశ్వభారతి జనరల్ హాస్పిటల్, ఆదోని గోపి చారిటబుల్ బ్లడ్ సెంటర్, ఎమ్మిగనూరు మహాత్మా గాంధీ బ్లడ్ బ్యాంక్ ఉన్నాయి. ఆలూరు, పత్తికొండ, కోడుమూరు, ఓర్వకల్లు, వెల్దుర్తి, ఆళ్లగడ్డ, పాణ్యం, అవుకు, కోయిలకుంట్ల, ఆత్మకూరు, సున్నిపెంట, నందికొట్కూరు, యాళ్లూరు, మిడుతూరు, వెలుగోడు, బేతంచెర్లలోనూ రక్తనిల్వ కేంద్రాలున్నాయి. ఏపీ బ్లడ్ సెల్ యాప్ ద్వారా స్వచ్ఛంద రక్తదానం, నమోదు, వివరాలు తెలుసుకునే అవకాశం ఉంది. దీనిని స్మార్ట్‌ఫోన్‌లోని ప్లేస్టోర్‌లోకి వెళ్లి 'ఏపీబ్లడ్‌సెల్' అని టైప్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రక్తదాతల నుంచి రక్తం సేకరించేందుకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని రక్తనిధికి ఒక రవాణా వాహనం ఉంది. నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సైతం రక్తనిధి సేకరణకు వాహనం ఏర్పాటు చేశారు.

**నాలుగేళ్లలో నిర్వహించిన క్యాంపులు, సేకరించిన రక్తం(యూనిట్లలో)**

| సంవత్సరం | మొత్తం రక్తదాన సేకరణ | దాతల ద్వారా సేకరించిన రక్తం | నిర్వహించిన క్యాంపులు | క్యాంపుల ద్వారా రక్తదాన సేకరణ |
|---|---|---|---|---|
| 2021-2022 | 59,174 | 47,913 | 139 | 5,700 |
| 2022-2023 | 63,558 | 50,421 | 291 | 10,520 |
| 2023-2024 | 62,366 | 50,487 | 312 | 9,049 |
| 2024లో మే వరకు | 11,544 | 9,439 | 76 | 555 |
| మొత్తం | 1,96,642 | 1,58,260 | 818 | 25,824 |

### రక్తదానం చేయడానికి అర్హత

- దాత బరువు 45 కిలోలు ఉండాలి.
- వయస్సు 18 నుంచి 60 ఏళ్లలోపు ఉండాలి.
- దాత నాడి నిమిషానికి 60 నుంచి 100 సార్లు కొట్టుకోవాలి.
- రక్తంలో హెచ్‌బీ శాతం 12.5 గ్రాములకు పైగా ఉండాలి.

### ఇవ్వాల్సింది 300 మిల్లీలీటర్ల రక్తమే..!

ప్రతి మనిషిలో 5 లీటర్ల రక్తం ప్రవహిస్తుంది. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చు. రక్తదానం సమయంలో ప్రతి వ్యక్తి నుంచి కేవలం 300 మిల్లీలీటర్ల రక్తం మాత్రమే తీసుకుంటారు. ఆ రక్తం మళ్లీ కొన్ని గంటల్లోనే శరీరంలో తయారవుతుంది. అన్ని పరీక్షలు చేసిన తర్వాతే రక్తం సేకరిస్తారు. సేకరించిన రక్తాన్ని అవసరం ఉన్న రోగులకు ఎక్కిస్తారు.

### నాన్న పేరుతో గ్రూపు ఏర్పాటు చేశాను



నేను కార్మిక శాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్నాను. మా నాన్న డేనియల్ రాజు రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ గుండెపోటుతో మరణించారు. ఆయన పేరుతో డేనియల్ రాజు ఫౌండేషన్‌ను స్థాపించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 35 వరకు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశాను. తలసీమియా పిల్లల కోసం గత ఏడాది 300 యూనిట్లు సేకరించాం. మా సేవా కార్యక్రమాల స్ఫూర్తితో విదేశాల్లోనూ రక్తదానం కార్యక్రమాలు చేస్తున్నారు. ఎంతో అరుదైన గ్రూపు రక్తం ఉన్న వారు కూడా మా సంస్థలో ఉన్నారు. వారు ఆపదలో ఎంత దూరమైనా సరే వెళ్లి రక్తం ఇచ్చి వస్తుంటారు.

– సుమన్, కర్నూలు

### రక్తదానంపై విస్తృత ప్రచారం



రక్తదానంపై జిల్లాలో విస్తృతంగా అవగాహన కల్పిస్తుండటంతో చాలా మంది యువత అడిగిన వెంటనే రక్తం దానం చేస్తున్నారు. రక్తం కొరత లేకుండా డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీల్లో రెడ్ రిబ్బన్ క్లబ్‌లను ఏర్పాటు చేశాం. దూరప్రాంతాల వారి కోసం సీహెచ్‌సీల్లోనే బ్లడ్‌స్టోరేజ్ సెంటర్లు ఏర్పాటు చేశాం. రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని బ్లడ్‌బ్యాంకుల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ ఎల్.భాస్కర్, జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ, కర్నూలు

### దాతల సంఖ్య పెరిగింది



రెడ్‌క్రాస్ రక్తనిధికి రక్తదాతల సంఖ్య పెరిగింది. ఇది వరకు ఏడాదికి 3వేల యూనిట్లు సేకరించేవారు. ఈ యేడాది 10 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నాం. ఇక్కడ సేకరించిన రక్తాన్ని రాయితీ ధరతో అవసరార్థులకు అందజేస్తున్నాం. తలసీమియా బాధిత చిన్నారులకు ఏటా వెయ్యి యూనిట్లకు పైగా రక్తాన్ని ఉచితంగా అందజేస్తున్నాం. రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని 14వ తేదీ రక్తనిధి ప్రాంగణంలో రక్తదాతలు, ఎన్‌జీఓలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సన్మానం చేయనున్నాం.

– డాక్టర్ కె.జి. గోవిందరెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, కర్నూలు

### తలసీమియా పిల్లలకు రక్తదానం




నా బిడ్డ తలసీమియా వ్యాధితో బాధపడుతోంది. ఈ వ్యాధి బాధితులకు ప్రతి నెలా వారి స్థితిని బట్టి ఒకటి నుంచి రెండుసార్లు రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. గతంలో నేను పాపకు రక్తం ఎక్కించేందుకు పడిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దాతలతో ఒకటి, తలసీమియా బాధితులతో మరొకటి వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ప్రతి నెలా రక్తం అందించే చూస్తున్నా.

– బి.శ్రీకాంత్, కర్నూలు

# వైఎస్సార్‌సీపీ నేత ఇంటిపై రాళ్ల దాడి

**బనగానపల్లె రూరల్:** స్థానిక బుడగజంగాల కాలనీ సమీపంలోని పాపిరెడ్డితోటలో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ నేత సుదర్శన్‌రెడ్డి ఇంటిపై బుధవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు రాళ్ల దాడికి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాలు.. టీడీపీ కార్యకర్తలు బుధవారం మధ్యాహ్నం సమయంలో సుదర్శన్‌రెడ్డి ఇంటి ముందే కావాలనే బాణా సంచ పేల్చుతూ, కేకలు, ఈలలు వేస్తూ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. రాత్రి ఇంట్లో నింద్రిస్తూ ఉండగా సుమారు 11 గంటల సమయంలో కొందరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటి వద్దకు వచ్చి కొద్ది దూరం నుంచే రాళ్లు రువ్వారు. సుదర్శన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు బయటకు వచ్చేలోపే నిందితులు పారిపోయారు. అనంతరం బాధితుడు సుదర్శన్‌రెడ్డి పోలీసులు ఫిర్యాదు చేశారు. కాగా దాడి విషయమై సీఐ గంటా శ్రీనివాసరావును వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని చెప్పడం గమనార్హం.



ఇంటి కిటికీ అద్దాలు ధ్వంసమైన దృశ్యం



వాటర్‌ప్లాంట్ శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

### కల్వటాలలో శిలాఫలకం ధ్వంసం

**కొలిమిగుండ్ల:** మండలంలోని కల్వటాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మినరల్ వాటర్ ప్లాంట్‌కు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించారు. అంతటితో ఆగకుండా ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులపై కర్రలతో దాడి చేసినట్లు సమాచారం.

# బొప్పాయి చెట్ల నరికివేత

**మద్దికెర :** మద్దికెర గ్రామానికి చెందిన రామకృష్ణ అనే రైతుకు చెందిన 2,700 బొప్పాయి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం తెల్లవారుజామున నరికివేశారు. దీంతో రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయారు. తాను నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని బొప్పాయి సాగు చేశానని చెప్పారు. ఇప్పటి వరకు రెండు కోతలు కోశానని, మరో రెండు కోతలురావాల్సి ఉందని పేర్కొన్నారు.గుర్తు తెలియని వ్యక్తులు చెట్లను నరికివేశారని,అనంతపురం జిల్లా కసాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లుతెలిపారు.



నరికిన చెట్లను చూపుతున్న రైతు

# హోటల్‌లోకి దూసుకెళ్లిన లారీ

**బొమ్మలసత్రం:** నంద్యాలలోని గాంధీచౌక్ సర్కిల్‌లో గురువారం లారీ అదుపు తప్పి టీ హోటల్‌లోకి దూసుకెళ్లింది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు.. తాడిపత్రి నుంచి లారీ డ్రైవర్ రాముడు గాంధీచౌక్‌లో ఉన్న హోల్‌సేల్ దుకాణాలకు లారీలో బస్తాలు తీసుకొచ్చారు. ఉదయం లారీని గాంధీ సర్కిల్‌లో కుడివైపునకు తిప్పితుండగా అదుపుతప్పి ఎదురుగా ఉన్న టీ హోటల్లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవటంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా టీ స్టాల్‌తో పాటు రెండు బైకులు దెబ్బతిన్నాయి. వాహనదారుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

## ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

- 12 తులాల బంగారు ఆభరణాలు అపహరణ

**కోవెలకుంట్ల:** పట్టణంలోని ఓ ఉపాధ్యాయుడి ఇంట్లో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాలు.. పద్మావతి నగర్‌లో నివాసం ఉండే వెంకటరాముడు ఆళ్లగడ్డ ప్రభుత్వ పాఠశాల, ఆయన భార్య సంజామల మండలం ఎగ్గోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో భార్యభర్తలు ఇంటికి తాళం వేసి పాఠశాలలకు వెళ్లారు. గుర్తుతెలియని దుండగలు మధ్యాహ్నం 1 గంట సమయంలో తలుపు గొళ్లెం బద్దలు కొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తాళం పగలగొట్టి అందులో ఉన్న 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదు అపహరించుకెళ్లారు. విధులు ముగించుకుని ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నంద్యాల నుంచి క్లూస్‌టీం రంగప్రవేశం చేసి ఆధారాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

### పడమర ప్రాతకోట పాఠశాలలో..

**పగిడ్యాల:** ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పడమర ప్రాతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. హెచ్‌ఎం సువర్ణ తెలిపిన వివరాలు.. పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా స్కావెంజర్ రాజేశ్వరి బుధవారం తరగతి గదులను శుభ్రం చేసి తాళాలు వేసి ఇంటికెళ్లింది. మరుసటి రోజు గురువారం ఉదయం పాఠశాల తెరిచి చూడగా పదవ తరగతి ఏ సెక్షన్ గదిలోని ఐఎఫ్‌పీ(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్లానెల్) టీవీ కనిపించకపోవడంతో హెచ్‌ఎంకు సమాచారం ఇచ్చింది. ఆమె పాఠశాలకు చేరుకుని రూ.1.20 లక్షల విలువైన టీవీ చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని ముచ్చుమర్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయశేఖర్ తెలిపారు.

## స్కూల్ బస్సు, కారు ఢీ

- విద్యార్థులకు తప్పిన ప్రమాదం

**కోవెలకుంట్ల:** కోవెలకుంట్ల-ఆళ్లగడ్డ ఆర్అండ్‌బీ రహదారిలో గురువారం సాయంత్రం ప్రైవేట్ స్కూల్ బస్సు, ఇన్నోవా కారు ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. కోవెలకుంట్ల పట్టణంలోని ఓ ప్రైవేట్‌స్కూల్ బస్సు పాఠశాల ముగిశాక పిల్లలను ఎక్కించుకుని కంపమల్ల గ్రామానికి బయలు దేరింది. తిరుపతి నుంచి యాగంటికి వస్తున్న ఇన్నోవా కారు భీమునిపాడు సమీపంలోని కుందరవాగు వంతెన వద్ద చేరుకోగానే రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదు. వాహనాల డ్రైవర్లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కోవెలకుంట్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

# గార్లదిన్నెలో ఎంపీపీ స్కూల్‌కు తాళం

- రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన



గార్లదిన్నెలో పాఠశాలకు తాళం వేసిన దృశ్యం



నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

**ఎమ్మిగనూరు రూరల్:** మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామ ఎంపీపీ పాఠశాలకు గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడి ఉపాధ్యాయులు ఏడాది క్రితం పదోన్నతిపై వెళ్లడంతో తాత్కాలిక ఉపాధ్యాయుడిని నియమించారు. 90 మంది విద్యార్థులు ఉండగా రెగ్యులర్ ఉపాధ్యాయుడు లేకపోవటంతో పలు మార్లు విద్యార్థుల తల్లిదండ్రులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. పాఠశాలలు పునఃప్రారంభం కావటంతో బడికి వచ్చిన తాత్కాలిక ఉపాధ్యాయుడు రంగస్వామిని విద్యార్థుల తల్లిదండ్రులు బయటకు పంపి తాళం వేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించి రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమించాలని, అంతవరకు పాఠశాలకు తమ పిల్లలను పంపేది లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు.

## క్యాన్సర్ ప్రాణాంతకం కాదు



మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామనాథం

**నంద్యాలటౌన్:** సకాలంలో క్యాన్సర్‌ను గుర్తిస్తే ప్రాణాంతకం కాకుండా నివారించి ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చని డీఎంఏ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామ నాథం అన్నారు. గురువారం స్థానిక సర్వజన ఆసుపత్రిలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో మెడికల్ ఆఫీసర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, పట్టణ ఆరోగ్య కేంద్రాల కార్యకర్తలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ అయన మాట్లాడుతూ జిల్లాలో 30 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ మొదటి దశ క్యాన్సర్‌ను గుర్తించేందుకు స్క్రీనింగ్ టెస్టు చేయాలన్నారు. దంత, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లను నిర్ధారించాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ బనగానపల్లె ఏరియా ఆసుపత్రిలోనూ క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, వైద్య సిబ్బంది ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాదరావు, డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా, డాక్టర్ కాంతారావు నాయక్, డాక్టర్లు కళావతి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## వరదనీటిలో గుర్తు తెలియని మృతదేహం

**కర్నూలు:** పాత కల్లూరు నుంచి దేవనగర్‌కు వెళ్లే మార్గంలో హంద్రీనది బ్రిడ్జి సమీపంలోని వరద నీటిలో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని పురుష మృతదేహం బయటపడింది. సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉండి 5.5 అడుగుల ఎత్తు ఉంటాడు. నీలం రంగు ఫుల్ షర్టు, నీలం రంగు జీన్స్ ప్యాంట్, నశ్యం రంగు ఫుల్ డ్రాయర్ ధరించాడు. మృతదేహం పూర్తిగా నీటిలో కుళ్లిన స్థితిలో ఉంది. స్థానికుల సమాచారం మేరకు గురువారం సాయంత్రం నాల్గవ పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని నీటిలో నుంచి వెలికితీసి ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచారు. ఆచూకీ తెలిసినవారు నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

**కర్నూలు:** బనగానపల్లెలో ఎక్సైజ్ కానిస్టేబుల్ రాజేంద్ర(33) కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డోన్ మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన ఈయన కొన్నేళ్లుగా ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్గా పని చేస్తున్నారు. ప్రస్తుతం బనగానపల్లెలో సీబీ ఎక్సైజ్ కానిస్టేబుల్గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్టడీ హాల్ నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా కొంత భూమి కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. స్టడీ హాల్, అటు పొలం మీద నష్టాలు రావడంతో అప్పుల ఊబిలో కురుకుపోయారు. దీంతో గత నెల 26న కర్నూలులో కలుపు నివారణకు వినియోగించే మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. కర్నూలు పెద్దాస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం సాయంత్రం మృతిచెందాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఆటో బోల్తా.. ఒకరు మృతి

- మరొకరి పరిస్థితి విషమం



చికిత్స పొందుతున్న సోమలింగమ్మ



మృతిచెందిన లక్ష్మయ్య

**ఆలూరు రూరల్:** ఆటో బోల్తా పడిన ఘటనలో పెద్దహోతూరు గ్రామానికి చెందిన గొల్ల లక్ష్మయ్య (60) దుర్మరణం చెందగా మరో ప్రయాణికురాలు సోమలింగమ్మ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పెద్దహోతూరు గ్రామానికి చెందిన లక్ష్మయ్య వ్యవసాయం చేస్తూ జీవనం గడుపుతున్నాడు. గురువారం ఉదయం విత్తనాలు కొనేందుకు అదే గ్రామానికి చెందిన అప్పీ ఆటోలో ఆలూరుకు బయలుదేరాడు. కొద్ది దూరం వెళ్లగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో లక్ష్మయ్య, ఆలూరు మండలం అరికెరకు చెందిన సోమలింగమ్మ తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ వీరేష్‌తో పాటు మరో ముగ్గురుకి ఎలాంటి గాయాలు కాలేదు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లక్ష్మయ్య కోలుకోలేక మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సోమలింగమ్మ కుడి కన్ను, తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి రెఫర్ చేశారు. మృతుడు లక్ష్మయ్యకు భార్య రామలక్ష్మి, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.